

సలహాల సుబ్బారావు

శ్రీమాన్ సుబ్బారావుకు ఆత్మవిశ్వాసం కొంచెం జాస్తి ! చదివింది ఆర్ట్సు అయినా తన గురించి తాను చాలా గొప్పగా భావించుకుంటూ ఉంటాడు. ఈ జబ్బు అతనికే గాదు - సగటు ఆంధ్రుడుకు ఉందని కొందరి అనుమానం. ఈ ఆత్మవిశ్వాసం ఎందుకు యింతగా స్వైన్ ఫ్లూలా పెరిగిపోయిందంటే అతను ఏ ఆఫీసులో పనిచేసినా కొందరు కొలీగులు అతన్ని సలహాలను యిమ్మని కోరడమే ముఖ్యకారణం. ఆపైన శ్రీమతిగారు కూడా అతను చెప్పిందానికి ఎప్పుడూ అడ్డుపడక పోవడం యింకో కారణం.

కాని ఈ మధ్యనే సుబ్బారావులో కొంచెం 'లోచూపు' కలిగి సలహాలు యివ్వడం మానుకుందామనుకుంటున్నాడు. ఎంతో బలవంతం చేస్తే తప్పించి యివ్వదలచుకోవడం లేదు. అయాచితంగా యిచ్చే సలహాలకు విలువ లేదని గ్రహించడం మొదలెట్టాడు. ఈ మధ్య, అదేదో ఆఫీసు గట్రా పెట్టి సలహాలిచ్చి దానికే వేలకు వేలు తీసుకొని వెలిగి పోతున్నారు కొందరని, అతనికీమధ్యే తెలిసింది కూడా.

ఆ రోజు ఆదివారం సుబ్బారావు కాలుమీద కాలేసుకుని కాఫీ సేవిస్తూ పత్రికను పఠిస్తున్నప్పుడు బావమరిది రంగారావు మెరుపులేని పిడుగులాగా ఊడిపడ్డాడు.

" బావా సుబ్బారావు ! వచ్చేశాడు ఈ రంగారావు ! " అంటూ సూట్ కేసుతో దిగబడిపోయాడు యింట్లోకి.

" అదేంటి సడెన్‌గా వచ్చావు?!" బోల్డు ఆశ్చర్యపోతూ అడిగాడు సుబ్బారావు.

" ఏం రాకూడదా! చెల్లాయి సుహాసినీ - నా రాక మీకేమయినా యిబ్బంది కలిగించిందా?" అంటూ లోపలికి గావుకేక పెట్టాడు.

" అదేంటన్నయ్యా ! రాక రాక నువ్వొస్తేనే వద్దంటానా?" లోపలనుంచి గరిటె తిప్పుతూ బయట కొచ్చింది సదరు సుహాసిని సుబ్బారావు భార్య. 'నువ్వు వస్తానంటే నే వద్దంటానా' అంటూ హమ్ చేసింది కూడా!

" అది కాదోయ్ రంగా ! దూరవాణిలో ఒక్క ముక్క చెప్పి ఏడ్వచ్చుగా ?"

" ఎలాగూ రావడం ఖాయం అయింది - మళ్ళీ సెల్లులో సొల్లుడు ఎందుకు? ఓ రూపాయి ఖర్చు ! " చొక్కా విప్పదీసుకుంటూ చెప్పాడు.

" అది కాదు రంగా ! పొరపాట్న మేము ఎక్కడికన్నా ఊరికి పోయి ఉంటే నీకు యిబ్బంది అయ్యేది కదా!" సమర్థించు కున్నాడు సుబ్బారావు.

" మా బావగారి సంగతి నాకు తెలియదా? ఊరికే ఎప్పుడైనా ఏ ఊరికైనా పోయాడా? ఆదివారాలు కూడా ఆఫీసుకు పోయే బాపతు. పైగా ఊరికి పోవాలంటే మాటలా ? బోల్డు ఖర్చు !" అంటూ బాత్‌రూములోకి దూరి పోయాడు రంగారావు.

సుబ్బరావు అతని వ్యంగ్యానికి ఖంగు తిన్నాడు.

కాఫీ టిఫెన్లు అయింతర్వాత రంగారావు అస్సలు విషయం చెప్పాడు.

" ఏదో నీ దయవలన మావాడు ఇంటర్ ఫెయిలయ్యాడు. మా వూళ్ళో ఫలానా బ్యాంకులో క్లాసు ఫోర్ పోస్టులు ఖాళీ పడ్డాయి. ఇక్కడ ఎవరినన్నా పెద్ద తలకాయను పట్టుకొని రికమెండు చేయించుకుందామని యిలా వచ్చాను." రంగారావు వివరించాడు.

" సంతోషం -కాని మీ వాడు ఫెయిలు కావడానికి - నా దయ ఎందుకు? అది మీ వాడి స్వయం ప్రతిభ కదా!" కించిత్తు చింతిస్తూ సిగ్గు పడుతూ అడిగాడు సుబ్బారావు.

" బాగా గుర్తు చేసుకో బావా ! ఓ మూడేళ్ళ క్రితం నేను మా బుజ్జిగాడ్ని యింటరులో ఏం చేయిస్తే బాగుంటుందని పొరపాట్న సలహా అడిగాను - "

సుబ్బారావు గుర్తు చేసుకున్నాడు. సదరు బుజ్జిగాడు టెంతు పరీక్షలు రాశాడు - తదుపరి కర్తవ్యంగా యింటర్ చదవదలచుకున్నాడు - ఏ గ్రూపు తీసుకుంటే భవిష్యత్తులో పనికొస్తుందని అడిగాడు. అప్పుడు తడుముకోకుండా సైన్సు గ్రూపు తీసుకోమని - అందులో మ్యాథ్సు తీసుకోమని తను చెప్పాడు. ఎందుకని అడిగితే ఆపైన బి.టెక్కు లాగించేస్తే ఏదో కంపెనీ వాళ్ళు ఎగురుకుంటూ వచ్చి పాతిక వేలు జీతం యిచ్చి బుజ్జిగాడ్ని ఎగరేసుకు పోతారని చెప్పాడు. ఇప్పుడది తన నెత్తిమీద కొచ్చింది.

" అవును మ్యాథ్సు తీసుకోమన్నాను - పాసు కాలేదా?!"

" హా ! ఆర్ట్సు తీసుకుంటే ఎప్పుడో అయిపోయేవాడు - వాడికి లెక్కలంటే భయమట - అయినా నువ్వు చెప్పావని వాణ్ణి దాంలో పారేశాను. ఇప్పటికీ తేరుకోలేక పోయాడు." రంగారావు ఇంకాసేపు బుజ్జిగాడు ఎంత బాధపడింది, తను సుబ్బారావు మాటను నమ్మి మూర్ఖంగా ఎలా మోసపోయింది విన్నవించుకున్నాడు.

" నిజమే రంగా ! చదివించేది నువ్వు - చదివేది వాడు - అటువంటప్పుడు వాడి అభిరుచి మేరకు - తెలివి తేటల మేరకు గ్రూపులు తీసుకోవాలి - చదువుకోవాలి ! కాని నాలాంటి సత్రకాయగాడు సలహా యిచ్చాడని అడ్డమైన చదువులు చదివితే యిలానే

ఉంటుంది." అని మోహానికి గంటు పెట్టుకుని అన్నాడు సుబ్బారావు.

ఆ నిష్ఠూరాలను కొంత కాలంలో మర్చిపోయాడో లేదో - కొన్నాళ్ళకు కజిన్ శ్రీశైలం కలిశాడు. సకుటుంబంగా వాళ్ళింటికి వేంచేశాడు, తన భార్య పార్వతికి మెడికల్ చెకప్ చేయించుకుందామని. వాళ్ళతో పాటు అతని పుత్రరత్నం సుబ్రహ్మణ్యం కూడా వచ్చాడు.

వాళ్ళ పనులన్నీ ముగిసిన తరువాత ఆరాత్రి తీరిగ్గా ఉన్నప్పుడు అడిగాడు సుబ్రహ్మణ్యాన్ని సుబ్బారావు.

" ఒరే సుబ్బిగా ! ఇప్పుడేం చేస్తున్నావురా?!"

" ఏముంది పెదనాన్న - నీ దయవలన ఉద్యోగాల కోసం చెప్పులరిగి పోయేట్లు తిరుగుతున్నాను -" సుబ్రహ్మణ్యం.

" అదేంటిరా ! బిటెక్కు చేశావు కదా - క్యాంపస్ సెలెక్షన్ రాలేదా?"

" ఆ ! అందరికీ ఎందుకొస్తాయి పెదనాన్నా ! ఏ కొందరి అదృష్టవంతులకో వస్తాయి. మా కాలేజీలో ఓ అయిదారు మందికి ఆ అదృష్టం కలిగింది. కొన్ని వందల మందికి అది దక్కలేదు. బయట కాంపిటీషన్ ఎలా వుంది? పైగా రిసెషన్ పీరియడు. ఉన్నా వాళ్ళకే ఉద్యోగాలు పోతున్నాయి. సెలెక్టు అయిన చాలా మందికి కూడా యింకా అప్పాయింటుమెంటు ఆర్డరు రాలేదు." బాధపడ్డాడు సుబ్రహ్మణ్యం.

" పోనీలేరా ! నీచదువు ఎక్కడికీ పోదు- ఇవ్వాళ కాక పోతే రేపైనా మంచి ఉద్యోగం వస్తుంది." ఓదార్చాడు సుబ్బారావు.

" అది కాదు అన్నయ్యా ! ఆరోజు నీ సలహా వినకుండా వాడిని ఆలైనులో ప్రవేశపెడితే బాగుండేది." శ్రీశైలం చెప్పాడు నసుగుతూ.

" అవును బావగారు! మీ రొద్దన్నారని మేము మానుకున్నాంగాని-వాడి చిన్నప్పుడే వాడిని టీవీలో ప్రవేశపెట్టి ఉంటే ఈరోజు రాజులాగా ఉండేవాడు." పార్వతి నిష్ఠూరంగా అన్నది.

" నేనేం సలహా యిచ్చానురా?" విస్తుపోయి అడిగాడు సుబ్బారావు.

" అదే పెద్దనాన్న ! 'ఆట కావాలా - పాటకావాలా' లాంటి ప్రోగ్రాంలో నేను పాటల పోటీల్లో ఒక రౌండులో గెలిచాను. నాన్న నీకు ఫోన్ చేసి చెప్పారు. ఫలానా ఛానెల్ వాళ్ళు నన్ను ఫలానా తేదీకి సిటీకి రమ్మంటున్నారు- నీ ఉద్దేశ్యమేమిటని?" గతం గుర్తు చేశాడు సుబ్రహ్మణ్యం.

సుబ్బారావుకు గుర్తుకొచ్చింది - లోకల్‌గా పాటల పోటీల్లో - సుబ్బు గెలిచాడు. తదుపరి రౌండ్లకోసం ఓ నెల రోజులు సిటీకి రమ్మని, శిక్షణ యిస్తామని భవిష్యత్తులో గొప్ప సింగర్ కాగలడని చెప్పారట. ఆ సందర్భంలో ఓసారి ఫోన్‌చేసి తన సలహా అడిగారు.

ఆర్నెల్లనుంచీ మంగలిషాపుకు వెళ్ళనీయకుండా! ఆగమన్నది ఎందుకో ఈరోజు తెలాల్సిందే!?
1
2
3
4
నిత్యానంద బాబా
ఆగమన్నది ఎందుకో తెల్సిందా!!
AVM
బాబాల
5

అప్పుడతను

"శ్రీశైలం ! పుట్టగొడుగుల్లాగా ఎన్నో ఛానెళ్ళు పుట్టుకు వస్తున్నాయి వాళ్ళ పాపులారిటీ కోసం రకరకాల కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. బాగా చదువుకునే కుర్రాడిని ఈ టీవీ కార్యక్రమాలంటూ డైవర్టు చేస్తే చదువు సంతకెళుతుంది. ముందు బాగా చదువుకోమను - ఆ తర్వాత అటువంటివి ఆలోచిద్దాం" అని చెప్పాడు.

" అవును సుబ్బూ ! ఇప్పుడు మటుకు మించిపోయిందేం ఉంది - ఇప్పుడు కూడ నువ్వు ఆ సంగీత కార్యక్రమాల్లో పాల్గొనవచ్చుగదా?" సుబ్బారావు అన్నాడు కించిత్తు చింతిస్తూ.

దాంతో శ్రీశైలం - పార్వతి - సుబ్రహ్మణ్యం భళ్ళున నవ్వారు. " ఇప్పుడా ! అది అప్పుడు చేసి ఉంటే బాగుండేది - ఈ పాటికి గొప్ప సింగరై టాపు లేపేవాడిని చదువు, చదువు అంటూ నీ మాటవిని నాన్న నన్ను నంజుకు తిన్నాడు. ఆ ఛాన్సు మిస్సయింది." సుబ్రహ్మణ్యం చెప్పాడు. " ఈ వయసులో, ఈ కాలంలో పోటీ బాగా పెరిగిపోయింది."

" వాడు ఆరోజు ఆ ఛానెల్ వాళ్ళ మాటవిని ఉంటే నిజంగా యిప్పుడు గొప్ప సింగరై రెండు చేతులతో సంపాదించేవాడు!" పార్వతి.

" పోటీల్లో పాల్గొన్న వాళ్ళంతా గెలుస్తారా?" సుబ్బారావు అడిగాడు.

" ఆ ! వీడి ఫ్రండే ఒకడు అలా పైకొచ్చి ఇప్పుడు గొప్ప సింగరై మంచి డిమాండులో ఉన్నాడు - సినీ ఫీల్డులో కూడ అడుగు పెట్టాడు - అయినా నిన్ను అని ఏం లాభంలే అన్నయ్యా ! మా ఖర్మ అలా కాలింది - నువ్వేదో సిటీలో ఉన్నావని - నీ కన్ని విషయాలు మా పల్లెటూరి వాళ్ళకంటే బాగా తెల్సు అని సలహా అడిగాం - అనుభవిస్తున్నాం. అయినా నువ్వు మా మంచి కోసమే చెప్పి ఉంటావులే !" అంటూ నిష్ఠూరాలు ఆడాడు శ్రీశైలం, పార్వతి కూడా వంత పాడింది.

" అందుకే అంటానమ్మా మీ బావగార్ని ఎవరికీ సలహాలివ్వద్దని. వింటేగా - కాస్త పొగిడితే చాలు - పొంగిపోయి - ఆంజనేయస్వామి లాగా గంతులేస్తూ సలహాలిస్తారు - బాగా అయింది." సుహాసిని బాగా అయిందన్నట్లు సైగలు చేసింది, సుబ్బారావుకు.

" చూడు సుబ్బూ ! మన రాత ఎలా ఉంటే అలా జరుగుతుంది. నే సలహా యిచ్చినంత మాత్రాన నువ్వు నా మీద ఆధారపడకుండా నీ నిర్ణయం నువ్వు తీసుకోవలసింది. అలా జరగలేదంటే విధివ్రాత అలా ఉంది. ఒక వేళ టీవీలోకి బొమ్మని నేను సలహా యిచ్చినా - అక్కడ ఫెయిలై ఉంటే నన్నే అనేవాళ్ళు మీరు. అందుకే యికమీదట ఎవరికీ సలహాలు యివ్వద్దని నేను అందరికీ సలహా యిస్తాను." సుబ్బారావు చెప్పాడు.

ఇది జరిగి ఒక నెలరోజులయిందో లేదో సుబ్బారావుకు యింకో విషమ పరీక్ష వచ్చింది.

అది వాళ్ళ ఆఫీసరు అవతారం రూపంలో వచ్చింది.

" చూడు సుబ్బారావు, మా పెద్దమ్మాయి సంధ్యకు సంబంధాలు చూస్తున్నాం. నీకు తెల్సుగా - మా అమ్మాయని - చెప్పుకోవడం కాదు గాని కుందనపు బొమ్మలాగుంటుంది. ఆ వినయం - సౌశీల్యం ఎవరికీ అబ్బవు. అంతా మన ట్రైనింగు ! యమ్మెస్సీ కూడా ఫస్టు క్లాసులో పాసయింది. ఈ కాలం పెళ్ళి అంటే పెద్ద గండం అయిపోతున్నది. ఒకటి సంబంధాలు దొరకడం చాలా కష్టంగా వుంది. దొరికింతర్వాత జాతకాలు కుదరడం యింకా కష్టంగా ఉంది - ఈ రెండూ అయిన తరువాత అబ్బాయికి అమ్మాయి నచ్చడం మరీ కష్టంగా ఉంది. ఈ మూడు అయింతర్వాత నాలుగోది ఇంక చెప్పక్కరలేదు." నిట్టూర్చాడు ఆఫీసరు.

" ఏంటి సార్ నాలుగోది !" వినయంగా అడిగాడు సుబ్బారావు.

" కట్నమయ్యా - కట్నం! అది లేంది ఇండియాలో పెళ్ళిళ్ళు అయ్యేట్లు కనపడ్డం లేదు. అదీ మనస్తోమత పట్టి కాదుట! అబ్బాయి అఘోరించే ఉద్యోగాన్ని బట్టిట! ఆ తరువాత ఆడపడుచు లాంఛనాలు - అలక పానుపులు - ఉండనే ఉన్నాయి. పులిమీద పుట్రలాగా అమ్మాయి పెళ్ళి ఖర్చు అంతా ఆడపెళ్ళి వాళ్ళే భరించాలి - ఇదెక్కడి న్యాయమయ్యా సుబ్బారావు?" ఘీంకరించాడు ఆఫీసరు అవతారం.

బిక్కచిక్కిన సుబ్బారావు వణికిపోయాడు, ఆయన్ని చూసి.

" ఇంతకూ మీ అమ్మాయికి ఓ సంబంధం వెతకాలి - అంతేగదా సార్ ! ఈ రోజునుండి - కాదు కాదు - ఈ క్షణం నుండి అదే పనిమీద ఉంటాను. మాకు ఆఫీసు పనికంటే ఆఫీసరు గారి పని ముఖ్యం !" చెప్పాడు సుబ్బారావు రెండు చేతులూ కట్టుకుని.

" థ్యాంక్స్ ! అంత పని చెయ్యొద్దు గాని - ఓ చిన్న పని చెయ్యి చాలు- నాకు ఓ చక్కటి సంబంధం వచ్చింది." ఆఫీసరు ఆగాడు గాలి పీల్చడానికి.

" మీకా - చక్కటి సంబంధమా - ఈ వయసులోనా ! కంగ్రాట్సు !" విస్మయంగా అభినందించాడు సుబ్బారావు.

" షటప్ ! నాక్కాదయ్యా ! మా అమ్మాయికి " అరిచాడు అవతారం.

" సారీ సార్ ! ఇంక సందేహం ఎందుకు - చేసెయ్యండి."

" అదే, అదే, ఆపని చేసేముందు నువ్వో పని చెయ్యాలి. మీ వూరికి వెళ్ళి వాళ్ళ వంశం గురించి - అతగాడి గురించి వాకబు చేసి నాకు రిపోర్టు యివ్వాలి. ఎందుకంటే అబ్బాయి స్వంత వూరు మీ స్వంత వూరే!" అంటూ ఓ కాగితం అందించాడు. వరుడు శంకర్. అతని తండ్రి మహదేవరావు, తల్లి గౌరమ్మ - యింటి నెంబరు వగైరాలున్నాయి.

" రెండు రోజులు సెలవు తీసుకుని మీ ఊరికి వెళ్ళి ఎంక్వయిరీ చెయ్యి - వాళ్ళగురించి

సేకరించిన సమాచారాన్ని రహస్యంగా నాకు తెలియచెయ్యి. ముఖ్యంగా నేను వాళ్ళ గురించి ఎంక్వయిరీ చేసినట్లు వాళ్ళకు ఏ మాత్రం అనుమానం రాకూడదు. ఎందుకంటే సంబంధం దాదాపు ఖాయం అయిపోయింది. అమ్మాయి - అబ్బాయి కూడ యిష్టపడ్డారు."

" సార్ ! మరి ఎందుకు సార్ విచారించడం -?" సుబ్బారావు అడిగాడు.

" అయినను పోయిరావలె అని కృష్ణ పరమాత్మ అనలా! అలాగే ఎంక్వయిరీ చేయకుండా చేసుకుంటే రేపు ఏదన్నా జరిగితే ఈ ఆడోళ్లు నన్ను నిందిస్తారు - ఒకే ! పోయిరా!" సెలవిచ్చాడు.

అంతే ! సుబ్బారావు ఆఘమేఘాలమీద పెళ్ళాం-పిల్లలతో స్వంతూరుకు వచ్చి పడ్డాడు. ఎప్పుడు రమ్మనా సెలవులు లేవని, దొరక లేదని చెప్పే సుబ్బారావు - యిలా చెప్పా చెయ్యకుండా వచ్చే సరికి ఆవూరి ఆబాలగోపాలం సంతోషపడ్డారు. చాలా మంది వచ్చి పలకరించి వెళ్ళారు.

ఆ సాయంత్రం రంగారావును తీసుకుని ఊరిమీద పడ్డాడు. ఇద్దరూ తమకు తెల్సినవాళ్ళని తెగ ఎంక్వయిరీ చేశారు. కొందరు శంకర్ కుటుంబం వాళ్లు చాలా పెద్ద మనుషులని చెప్పారు. కొందరు దొంగవెధవలని చెప్పారు. కొందరు వారు సాంప్రదాయ హీనులని చెప్పారు. ఇంకా కొందరు గంపగయ్యాళులు, వారితో మీ ఆఫీసరు అమ్మాయి ఎక్కడ వేగుతుందని అడిగారు కూడ.

తల బొప్పి కట్టి యిల్లు చేరుకున్నాడు. సుహాసిని ఎంక్వయిరీ కూడా భిన్నమయిన అభిప్రాయాలనే వినిపించింది. శంకరంకు యిదివరకే పట్టణంలో పెళ్ళయిందని - గొడవలొచ్చి వదిలేశాడని ఎవరో చెప్పారుట!

మరునాడు మళ్ళీ విచారణకు బయలు దేరాడు రంగారావు సహితంగా. రామయణంలో పిడకలవేటలాగా అతనికో చేదు అనుభవం ఎదురైంది. " ఆగవయ్యా ! సుబ్బారావు - మూడు సంవత్సరాల క్రిందట మాతో ఇన్సూరెన్సు చేయించావు గదా - గుర్తుందా?" ఓ ముసలాయన అడిగాడు. ఆయన టీచరుగా రిటైరయితే కొంత డబ్బు చేతికందింది. దాన్ని ఎలా మదుపు చేస్తే బాగుంటుందని సుబ్బారావును అడిగాడు. అదే సమయానికి అతని మిత్రుడు, బీమా ఏజెంటు అప్పారావు రావడం సంభవించింది. యూనిట్ లింకుడు పాలసీలు కొత్తగా వచ్చాయని దానిలో మదుపు చేస్తే మూడు సంవత్సరాలలో నాలుగు రెట్లు అవుతుందని చెప్పాడు. ముసలాయనకు నమ్మకం కుదరక సుబ్బారావును అడిగాడు ఏం చెయ్యమంటావని సలహా కోసం.

" అవును మాష్టారు ! ఇప్పుడు కొత్తగా ఇటువంటి యూలిప్పు పాలసీలు వస్తున్నాయి. ఇవి సెన్సెక్సు పెరిగినప్పుడల్లా విలువను పెంచుకుంటాయి. సెన్సెక్సు సెన్సిటివ్ పాలసీలు.

రు5000/- ల
ట్రింగ్..ట్రింగ్
AVM

మన బ్యాంకుల్లో - పోస్టాఫీసుల్లో మనకొచ్చే వడ్డీ చాలా తక్కువ. ఇదైతే డబుల్ - త్రిబులు అవుతుంది. ఉదాహరణకు మీరు రెండు లక్షలు యిప్పుడు జమ చేస్తే మావాడు చెప్పినట్లు

,, కాకపోయినా, అధమ పక్షంలో నాలుగు లక్షలు అవుతుంది మూడేళ్ళల్లో." అంటూ అప్పారావును సమర్థించాడు.

ఇంకేం, ఆయన రెండు లక్షలు వేశాడట. మొన్న డబ్బుకు యిబ్బంది అయి తీసుకుందామని పోతే కేవలం అరవై వేలు వస్తాయని ఆఫీసు వాళ్ళు చెప్పారట. దాంతో మండి పడ్డాడు. సుబ్బారావుమీద. నానా దుర్భాషాలు ఆడాడు. సుబ్బారావుకు గుర్తొచ్చింది - అతనితో పాటు యింకో నలుగురితో కూడా పాలసీలు చేయించినట్లు.

" సారీ ! మాష్టారు. నన్ను క్షమించండి. ప్రపంచ ఆర్థిక పరిస్థితి యింత ఘోరంగా దెబ్బతింటుందని నేను కలగన్నానా? కొన్నాళ్ళు ఓపిక పట్టండి - మీ డబ్బులు మీకు వస్తాయి."

అతన్ని శాంతింప చేయడానికి ఎంతో సమయం పట్టింది. అతనికి కూల్ డ్రింకు తాపించి పంపించే సరికి తల నెప్పి వచ్చింది.

ఇంతలో అవధాని తగిలాడు - అతడు ఇతనికి గురువు.

" నీకు కాస్తన్న బుద్ధి ఉందా? పిల్లపెళ్ళికి పెట్టుబడిగా నన్ను సిటీలో ప్లాటు తీసుకోమన్నావు. నీ మాట నమ్మి పదిహేను లక్షలు పెట్టి లాస్టియరు ప్లాటు తీశాను. తీరా అవసరానికి ఇప్పుడు అమ్ముదామంటే దాన్ని ఏడు లక్షలకు కూడా కొనే వాడు లేడు. డబ్బంతా తీసుకుపోయి ఏట్లో గుమ్మరించి నట్లయింది. ఆ లాసు ఎవరు కడతారు? నువ్వు కడతావా? పోస్టాఫీసులో వేసుకున్నా కాస్తో కూస్తో వడ్డీ వచ్చేది. ఆఖరికి బ్యాంకులో వేసుకున్నా అవసరానికి వాడుకునే వాడిని. ఇప్పుడేమిటి నా గతి!" అంటూ సుబ్బారావు కాలరు పట్టుకు గుంజాడు, కోపంగా అవధాని.

రంగారావు అడ్డుపడి శాంతింప చేశాడు అతికష్టంమీద.

" చూడండి గురువుగారు ! మీ మంచి కోరి నేను చెప్పాను. ఈలోపు రియల్ ఎస్టేటు డౌను అయితే నేనేం చెయ్యను? కొంత కాలం ఆగండి-మీ డబ్బులు మీకొస్తాయి." అంటూ ఓదార్చాడు.

" సరే ! ఇంకో సంవత్సరం ఆగుతాను. ఒకవేళ నారేటు నాకు రాకపోతే నువ్వే ఆ ప్లాటు తీసుకుని - నా డబ్బులు నాకివ్వాలి!" వార్నింగు యిచ్చి వెళ్ళిపోయాడు అవధాని.

ఇంక ఏం గొడవలు వస్తాయో అని చెప్పి ఆరాత్రే సుబ్బారావు సిటీకి బయలుదేరి వచ్చాడు. మరునాడు ఆఫీసుకు వెళ్ళాడు. అవతారం ఛేంబర్‌లోకి ప్రవేశించాడు ఎంక్వయిరీ

గురించి చెబుదామని.

" రావయ్యా సుబ్బారావు, నీ గురించే నేను ఎదురు చూస్తున్నా! నువ్వు వెళ్ళావో లేదో- శంకరం వాళ్ళు వచ్చి నా పీకలమీద కూర్చున్నారు. వాళ్ళకి చాలా గొప్ప సంబంధం వచ్చిందట. కాని ముందు మాట మనకు యిచ్చారు కాబట్టి - మనల్ని ఒక మాట అడిగి దానికి పోదామని వచ్చారు. వెంటనే 'యస్సుఆర్‌నో' చెప్పమన్నారు. అందుకే ఇంక ఆరోజే నిశ్చితార్థం చేసుకున్నామయ్యా! వచ్చే శుక్రవారం పెళ్ళి!" అంటూ ఆఫీసర్ అవతారం చెప్పుకొచ్చాడు, ఆ వివరాలు.

సుబ్బారావు యింకేం మాట్లాడలేకపోయాడు.

పెళ్ళి ఘనంగా జరిగింది... అమ్మాయి కాపురానికి వెళ్ళింది.

కొన్ని నెలల తర్వాత సుబ్బారావు శంకరగిరి మాన్యాలకు బదిలీ అయ్యాడు. లబలబ కొట్టుకుంటూ అవతారం కాళ్ళమీద పడ్డాడు.

" సుబ్బారావు నీమూలంగా నాపరువు పోయిందయ్యా! మా అల్లుడి గురించి వాళ్ళ వూళ్ళో అందరితో ఎంక్వయిరీ చేశావట. దాని మూలంగా వారికి పరువు నష్టం కలిగిందట-" అంటూ చాలా చెప్పాడు ఆఫీసర్.

సుబ్బారావు ఏడ్చుకుంటూ తన ఎంక్వయిరీ మొత్తం చెప్పాడు.

" మరి అంత చెత్త సంబంధం అయినప్పుడు ముందే నాకెందుకు చెప్పలేదు?"

" నేను వచ్చే సరికే మీరు నిశ్చితార్థం చేసుకున్నారు కదు సార్!"

" అయితే ఏం, పీటల మీద పెళ్ళిళ్ళే ఆగిపోతున్నాయి - నువ్వు ఏమాత్రం ముందు చెప్పినా మా అమ్మాయికి ఈ ఘోర నరకం తప్పేది!"

" నిశ్చితార్థం అయిన తరువాత చెబితే సంబంధం చెడగొట్టడానికి చెబుతున్నానని దండిస్తారని భయపడ్డాను." నీళ్ళు నమిలాడు.

" ఎనీ హౌ ! యూ డిజర్వు పనిష్మెంటు ! నిజం తెల్సి నాకు సలహా యివ్వనందుకు నిన్ను క్షమించ లేను. సరే! వెంటనే రిలీవు అయి వెళ్ళిపో నీ మొహం నాకు చూపించకు." ఆగ్రహంతో ఆఫీసర్ అవతారం అతన్ని బయటకు పంపించాడు.

" అయ్యో ! వద్దని చిన్న సలహా యిచ్చి వుంటే తనకిన్ని కష్టాలు తప్పేవి గదాని సుబ్బారావు విచారించాడు.

- కృష్ణాజిల్లా రచయితల ప్రత్యేక సంచిక-2011

నా భక్తికి మెచ్చి
లంకె బిందె ఇచ్చావా!
కనకదుర్గమ్మ
తల్లీ!!
ఇందులో బంగారు నాణాలున్నాయి!
ఏదో కాగితం వున్నట్లుందే!!?
ఇందులో సగం
నా
హుండీలో
వెయ్యి!
– కనకదుర్గ
అలా తెలివికి పోక
అమ్మవారు
చెప్పినట్లు
చెయ్యి!!
ఈ బంగారాన్ని, నేను నా భర్తా, నా నల్గురు
పిల్లలకు, ఆరువాటాలుగా పంచి! నా వాటాలో
సగం అమ్మవారి హుండీలో వేస్తా!!
అయ్యో! హుండీలో వేయగా
మిగిలిన బంగారం
అంతా రాళ్ళుగా
మారిందే!!?
వాఁ-వాఁ(....
AVM

మంచి మందులే వాడాను! అయినా నొప్పులు తగ్గలేదు! ఎందుకనో!?
ఆయన అది లేనిదే వుండలేరు!!
AVM


తలా పది వేలు అప్పు ఇస్తున్నాం! వడ్డీ లేదు!
చల్లగా.. వుండండి మంత్రిగారూ!
నిండు నూరేళ్ళు జీవించండి!!
ఏంటిసార్?! వందే ఇచ్చారూ!?
మీడియా వెళ్ళిపోయిందిగా!
నీ కింకోటి తెల్సు!
ఏవిటో అదీ!?
మొదటి ముగ్గురూ!.. మా ఇంట్లో వాళ్ళే! మారు వేషంలో వున్నారు!!